యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: యువత క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఉందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపల్ రాంపల్లిలో బీరప్ప టెంపుల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గెలుపోటములను సమానంగా తీసుకుంటూ యువత క్రీడాపోటీల్లో పాల్గొనాలని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు గండి అంజయ్యగౌడ్, శ్రీధర్, కొకుట్ల అనంతరెడ్డి, పరకాల పెంటయ్య, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటిపన్నులు చెల్లించాలి



ఘట్‌కేసర్: వందశాతం ఇంటి పన్నులు చెల్లించాలని కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలో ఇంటిపన్నుల వసూలును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మొండి బకాయిలు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వార్డు ఆఫీసర్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్‌సీఈలో ‘హ్యాక్-ఎన్-విన్’



విజేతలకు చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపాల్

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో ‘హ్యాక్-ఎన్-విన్’ పేరిట 24 గంటల హ్యాకథాన్ నిర్వహించారు. రెండ్రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొని సమస్యకు పరిష్కారాలు చూపారు. మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ ప్రతినిధులు మెంటర్లుగా వ్యవహరించగా విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన అవసరం



బడ్జెట్ టాక్‌లో పాల్గొన్న అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు భవిష్యత్తులో వ్యాపారరంగంలో రాణించాలంటే బడ్జెట్‌పై అవగాహన అవసరమని ఎమ్మార్‌సెట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎంబీఏ డీన్ నవీన్‌కుమార్ తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సెట్ కళాశాలలో ‘బడ్జెట్ టాక్’ పేరిట ఎంబీఏ విద్యార్థులకు బడ్జెట్‌పై రెండ్రోజుల పాటు అవగాహన కల్పించారు. బడ్జెట్‌లో ఆయా రంగాల వారీగా కేటాయింపులపై అవగాహన కల్పించి డిబెట్లు నిర్వహించారు. గౌసియా షేక్, శివారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెట్టింగ్ గేమ్ ప్రచారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

అల్వాల్: బెట్టింగ్ గేమ్ ప్రచారకులు, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఏసీపీ మహేష్‌కు ఫిర్యాదు చేశారు. నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అనంతరం మాట్లాడుతూ.. మెదక్, రామాయంపేట్ తదితర ప్రాంతాల్లో బెట్టింగ్ యాప్‌ల కారణంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలు చాలా ఉన్నాయన్నారు. ఈ యాప్‌లు నడిపించే వారి వెనుక ఎంతటి వారు ఉన్నా కఠినచర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే రాష్ట్రంలో గంజాయి విక్రయదారులు, గ్యాంగ్‌లపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ స్థానిక నేతలు పాల్గొన్నారు.

హైవేపై అంధకారం!

- వెలగని సెంట్రల్ లైటింగ్
- పలుచోట్ల రెయిలింగ్ తొలగింపు
- పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారిపై రెయిలింగ్ పోయిన ప్రదేశం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి నుంచి అన్నోజిగూడ వరకు జాతీయ రహదారి (163) విస్తరణ పనులు జరిగాయి. రూ. కోట్లు ఖర్చు చేసి రోడ్డు విస్తరణతో పాటు బాక్స్ నాలా, రెయిలింగ్, నాలాపై టైల్స్, డివైడర్ మధ్యలో రెయిలింగ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణపై అధికారులు దృష్టి సారించకపోవడంతో పలు సమస్యలకు దారితీస్తున్నాయి.

ఇబ్బంది పడుతున్న వాహనదారులు..

రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయగా.. లైట్లు వెలకగపోవడంతో రాత్రిపూట హైవేపై అంధకారం అలముకొంటోంది. దీంతో వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్ల నిర్వహణపై అధికారులు దృష్టి సారించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సీసీ కెమెరాలున్నా చర్యలు శూన్యం..

రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన రెయిలింగ్‌ను తొలగిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు పనులు జరుగుతున్నప్పుడు రెయిలింగ్‌ను క్రమంగా తొలగిస్తున్నారు. డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన రెయిలింగ్‌ను కూడా కొన్నిచోట్ల తొలగించారు. తొలగించిన సామగ్రి కనిపించకుండా పోవడంపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా చర్యలు తీసుకోకపోవడంపై అధికారుల అసమర్థతకు అద్దం పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ధ్వంసమవుతున్న బాక్స్ నాలా..

రోడ్డుకు ఇరువైపులా వరద నీరు వెళ్లేందుకు బాక్స్ నాలా నిర్మించారు. వీటి మీదుగా లారీలు వెళ్లడంతో కొన్నిచోట్ల ధ్వంసమయ్యాయి. పాదచారులు నడిచేందుకు వీలుగా నాలాపై టైల్స్ వేశారు. అనేక చోట్ల టైల్స్ పగిలిపోయాయి. ఈ ఫుట్‌పాత్‌లపైనే చిరువ్యాపారులు డబ్బాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు.

దుమ్ము ధూళితో అవస్థలు ..

రోడ్డు అంచుల వైపు, డివైడర్లకు ఇరువైపులా దుమ్ము, ధూళి పేరుకుపోతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మేడ్చల్‌రూరల్: తమ కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులోని బాలాజీనగర్, వెంకట్రామయ్య తదితర కాలనీవాసులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్థానిక మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. నీటి సమస్య విపరీతంగా పెరగడంతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, డబ్బులు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించుకోవాల్సి వస్తుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి నీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు. నీటి సమస్యను తొలగించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. మూడ్రోజుల్లో నీటి సమస్య తొలగిస్తామని కమిషనర్ నాగిరెడ్డి హామీ ఇచ్చారు.

మైక్రోసాఫ్ట్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక



విద్యార్థిని కీర్తిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్ విద్యార్థిని కీర్తి మైక్రోసాఫ్ట్ సంస్థలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక కావడంపై ఎమ్మెల్యే మల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో బీటెక్‌లో ఐటీ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థిని కీర్తి మైక్రోసాఫ్ట్‌లో ఎంపికవ్వడంతో శనివారం ఎమ్మెల్యే మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, ఐటీ డీన్ వసంతకుమార్‌లు శాలువాతో సత్కరించి అభినందించారు. ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.1.20లక్షల వేతనంతో పాటు రూ.4 లక్షల అలవెన్సులు విద్యార్థిని అందుకోనుందని ప్రిన్సిపాల్ వివరించారు.

నిరంతర సాధనతోనే కలలు సాకారం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: క్రీడాకారులు ఎంచుకున్న క్రీడల్లో రాణించాలంటే నిత్య సాధన ఎంతో ముఖ్యమని ప్రపంచ చెస్ బాక్సింగ్ చాంపియన్ షిప్ విజేత, గోల్డ్ మెడలిస్ట్ తక్కడపల్లి ప్రతిభ అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజుల పాటు సాగిన రోజమ్మ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏదైనా సాధించాలనుకుంటే ప్రతిరోజు సాధన అవసరమని తాను మార్షల్ ఆర్ట్స్ సాధన చేసే సమయంలో నాలుగేళ్ల పాటు తల్లిదండ్రులకు తెలియకుండా పట్టుదలతో సాధన చేసి సాధించానన్నారు. కళాశాల చైర్మన్ బాలారెడ్డి, సెక్రటరీ టీవీరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కళాశాల డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, వెంకటనారాయణ, స్వరూపరాణి, రవీంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వెంచర్!



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

పోచారం: నాలా ఆక్రమించి వెంచర్ ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ రైతులు గోపు బాలరాజ్‌యాదవ్, శ్రవణ్, బాలకృష్ణ, రమేష్, నగేష్, కృష్ణ ఆరోపించారు. శనివారం కొర్రెముల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొర్రెముల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 387, 405,406, 428లో హెచ్ఎండీఏ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ చేస్తున్నారన్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, పైన పేర్కొన్న సర్వే నెంబర్లలో గోపు, మునుకుంట్ల, చింతపాటి కుటుంబాలకు 11.05 ఎకరాల భూమి ఉందని, ఇందులో 2.25 ఎకరాలను ముంత మైసయ్య, ఆంజనేయులు, మల్లమ్మ వద్ద వెంచర్ నిర్వాహకులు కొనుగోలు చేసి, 2.50 ఎకరాలు అధీనంలోకి తీసుకున్నారని వాపోయారు. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన ఉమ్మడి భూమిని భాగస్వాములు ఇంకా పంచుకోలేదని, అలాంటప్పుడు వెంచర్ ప్రతినిధులు కొనుగోలు చేసిన భాగం ఎక్కడ వస్తుందో తెలియకుండానే పనులు చేపట్టారన్నారు. వెంచర్‌కు ఆనుకుని ఉన్న డప్పోను వాగును కూడా కబ్జా చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంచర్‌లో చేపట్టిన పనులను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

‘మహిళా శక్తిని నిర్వీర్యం చేసేలా పరిపాలన’



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

జవహర్‌నగర్: ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం, మహిళా సాధికారతకు రూ.2500 ఇస్తామని ఎన్నికల్లో హామీనిచ్చి గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాశక్తిని నిర్వీర్యం చేసేలా ఉందని, దీనిపై మహిళలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని భారత జాతీయ మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి పిలుపునిచ్చారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ గిరిప్రసాద్‌నగర్‌లో శనివారం కోశాధికారి శ్యామలత ఆధ్వర్యంలో మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం అంగట్లో సరుకుగా మారాయని, విద్యాశాఖకు ఇప్పటికీ మంత్రి లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. చట్టసభల్లో నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి చేరాలని కోరారు. జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి, నాయకులు దర్శన్ యాదగిరి, ప్రమీలాయాదవ్, పద్మ, సంతోష్, రాజేశ్వరి, జయమ్మ, నాగలక్ష్మి, మల్లిక, కవిత, బాలలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతల ప్రభావంపై పీపీటీ ప్రెజెంటేషన్

సాక్షి,సిటీబ్యూరో: తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొనే విధానాలపై డీఎంహెచ్‌ఓ హాల్‌లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ (పీపీటీ) ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఒక పోస్టర్ విడుదల చేసింది. జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మల్లీశ్వరి, వైద్యశాఖ అధికారులు డాక్టర్ సత్యవతి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ కౌశిక్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు



శామీర్‌పేట కట్టమైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట కేంద్రంలోని కట్టమైసమ్మ అమ్మవారిని ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. శనివారం ఆమె హైదరాబాద్ నుంచి కొమురవెల్లి ఆలయానికి వెళ్తున్న మార్గం మధ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి శామీర్‌పేట్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అలై బలై- 2025 జిల్లా సమావేశం



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను సన్మానిస్తున్న దృశ్యం

శామీర్‌పేట్: హైదరాబాద్ నగర శివారు తూంకుంట మున్సిపాలిటీలో శనివారం రోటరీ 3150 ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అలై బలై- 2025 జిల్లా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గవర్నర్‌ను ఘనంగా సన్మానించారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూ

డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని బస్తీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి తెలిపారు. అర్హులు దరఖాస్తు ఫారంతో ఈనెల 24న మేడ్చల్ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమె కోరారు. ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్ కింద 8 మెడికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. అభ్యర్థులు ఎంబీబీఎస్ పూర్తి టీఎస్ మెడికల్ కౌన్సిల్‌లో నమోదు చేసుకుని ఉండాలన్నారు. 18 ఏళ్ల నుంచి 44 ఏళ్లు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, రిటైర్డ్ సరీ్వస్‌మెన్‌కు 5 ఏళ్లు, ఎస్సీ, బీసీలకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు వయోపరిమితిని సడలిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తు ఫారంతో ఫోటోను జతచేసి డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి రావాలని ఆమె కోరారు.

సంక్షేమ పథకాలతో సామాన్యులకు మేలు



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వజ్రేష్‌యాదవ్ తదితరులు

శామీర్‌పేట్: సామాన్య ప్రజలకు మేలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్ అన్నారు. శనివారం శామీర్‌పేట మండలం, పొన్నాల్ గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ గడ్డం రమేష్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మెనిఫెస్టోలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. బీసీలకు ఇచ్చిన హామీల మేరకు 42 శాతం రిజర్వేషన్ అమలుపరిచేందుకు అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టారని, ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, వైఎస్‌గౌడ్, కిషోర్‌యాదవ్, వెంకటేష్, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వజ్రేష్‌యాదవ్ తదితరులు

కీసర: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లులు చట్టసభల్లో ఆమోదం పొందడంతో నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పుశ్రీనివాస్‌రెడ్డి, రామారావు ఆధ్వర్యంలో రాంపల్లి చౌరస్తా నుంచి దమ్మాయిగూడ మున్సిపల్ రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు భారీర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్లు పెంచడంతో పాటు, ఎన్నో ఏళ్ల తరబడి ఎస్సీవర్గీకరణ కోసం ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గానికి మేలు చేసేందుకు అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందేలా కృషి చేశామన్నారు. రెండు బిల్లులను అసెంబ్లీలో ఆమోదం పొందడంతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నేతలు మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కందాడి శ్రవన్‌రెడ్డి, శోభారాణి, ముప్పశ్రీలత, సరితారమేష్, శ్వేత, బండారు మల్లేష్‌యాదవ్, నర్మద తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న సిబ్బందితో అధికారులు

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో శనివారం డ్రైవర్లు, సిబ్బందికి 2025 జనవరి, ఫిబ్రవరి నెలలకు ప్రగతిచక్రం పురస్కారాలు అందజేశారు. అత్యధిక ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లు, ఉత్తమ కండక్టర్లు, మెకానిక్, సిబ్బందికి కూకట్‌పల్లి డివిజన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ అపర్ణ, సికింద్రాబాద్ రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ కల్యాణ్, డిపో మేనేజర్ సుధాకర్‌లు అభినందించి పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం సిబ్బందికి వేసవి సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ రామారావు, స్నేహలత, వీఎస్ఎన్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

‘కోడ్ ఉన్నతి ఇన్నోవేషన్’ మారథాన్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఘట్‌కేసర్: ఎస్ఏపీ ఇండియా, ఎడ్యూనెట్ ఫౌండేషన్, ‘తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్’ (టీఏఎస్‌కే) సంయుక్తంగా నిర్వహించిన ‘కోడ్ ఉన్నతి ఇన్నోవేషన్’ మారథాన్‌లో కొండాపూర్ సంస్కృతి కళాశాల ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. సంస్కృతి విద్యార్థులు టాప్- 10లో నిలువగా మరో బృందం గ్రాండ్ విజేతగా నిలిచింది. సీనియర్ టెక్నికల్ మేనేజర్ చంద్రిక మోహన్‌బాబు పర్యవేక్షణలో విద్యార్థులు భార్గవి, నవీన్, భాను, చందర్, స్టాలిన్, శివసాయి ‘ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డయాగ్నస్టిక్ ప్లాట్‌ఫామ్’ను రూపొందించారు. ఇది కృత్రిమ మేధస్సును ఉపయోగించి ఆరోగ్య సమస్యలపై ముందస్తు నిర్ధారణ చేస్తుంది. విద్యార్థులు సిరి ప్రశాంతి, రమ్య, పూజ వీడియోల విషయాన్ని ఆటోమెటిక్‌గా సంగ్రహించే ఆవిష్కరణను రూపొందించి టాప్-10లో నిలిచారు. ముఖ్యఅతిథులుగా కళాశాల ఇన్నొవేషన్ విభాగాధిపతి అరుణ్‌రెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి డాక్టర్ జయేష్‌రంజన్ ప్రశంసాపత్రాలను అందజేశారు. సంస్కృతి విద్యాసంస్థల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జానకీరాములు, ప్లేస్‌మెంట్ హెడ్ నీలమ్‌సింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ‘సైన్స్ ఫెయిర్’



శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు తాము ప్రదర్శించిన అంశాలపై ఇంగ్లిష్‌లో చక్కగా వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ నాగరాజు, నాయకులు బండి జగన్నాథం, మధుకృష్ణ, గోపి, వీరేషం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ప్రత్యేక ప్రార్థనల్లో వజ్రేష్‌యాదవ్, మహేష్‌గౌడ్ తదితరులు

ఘట్‌కేసర్: పట్టణంలోని జామామజీద్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, బీ- బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తహసీల్దార్ రజిని, కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టి.అజయ్, నియోజకవర్గ అధ్యక్షుడు బి. అజయ్, మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు వినోద్, మాజీ కౌన్సిలర్ మల్లేష్, అన్నూబాయ్, ఖయామ్, ఫరూక్, రహమాన్, ఆర్‌బిలు కావ్య, సాయిరాం, పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నీటి వినియోగంపై అవగాహన

సాక్షి,సిటీబ్యూరో: భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్‌లో ప్రపంచ నీటి దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూగర్భ, జలవనరులశాఖ అధికారులు శనివారం తెలంగాణ గ్రౌండ్ వాటర్ వెలికితీత నియమాలపై అవగాహన కల్పించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఉద్యోగులు, జిల్లా లైన్ డిపార్ట్‌మెంట్లు, పరిశ్రమలు, మైనింగ్ - క్రషర్ యూనిట్లు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ యూనిట్లు, వ్యవసాయ వర్గాలు నీటి వెలికితీత నియమాలు, నిర్వహణ, ప్రాముఖ్యతపై అవగాహన పొందారు. రిగ్ యాజమానులు వారి వాహనాలను భూగర్భ జలశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అనధికార బోర్లు, డ్రిల్లింగ్‌లను నియంత్రించాలని కోరారు. భూగర్భ జలవనరుల శాఖ అధికారి హరీష్‌బాబు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, రిగ్ యాజమానులు పాల్గొన్నారు.